A9 NEWS TELANGANA

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 13 బుధవారం 06 మే 2026 పేజీలు :08 వెల:రూ.5/-

ద్రవిడ రాజకీయాల్లో నవశకం: విజయ్ ప్రభంజనం



3 లో..

# ఢిల్లీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి..

- మెట్రో ఫేజ్-2పై దృష్టి
- కేంద్ర అనుమతుల కోసం కీలక భేటీలు
- పెండింగ్ ప్రాజెక్టులు, నిధులపై విజ్ఞప్తి
- జాతీయ రాజకీయాలపై కూడా చర్చల సూచనలు

**హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం ప్రతినిధి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం.ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై ముఖ్యమంత్రి విజ్ఞప్తులు చేయనున్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పాలనాపరమైన అంశాలతో పాటు జాతీయ రాజకీయాలపైనా ఈ పర్యటనలో చర్చలు జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోనున్నారు.ఇటీవల కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంతో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల సాధనలో కీలకంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



## సీఎం స్టాలిన్ రాజీనామా

ఎన్నికల్లో ఘోర పరాజయం ప్రభావం
విజయ్ ద్విగుణ విజయం సంచలనం


**చెన్నై, మే 05 (మన ప్రజాగళం):** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు సమర్పించారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్ ఈసారి



మిగతా 2 లో..

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

ఫుజైరా దాడితో పరిస్థితులు తీవ్రం
ముగ్గురు భారతీయులు గాయంపై భారత్ ఆగ్రహం
శాంతి చర్చలకు భారత్ మద్దతు



**న్యూఢిల్లీ, మే 05 (మన ప్రజాగళం):** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

మిగతా 2 లో..

## ఏరోస్పేస్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

2 లో..

## చైనాలో బాణాసంచా ఫ్యాక్టరీ పేలుడు

## స్వదేశీ ఆయుధాలతో సైనిక శక్తి బలోపేతం

‘ఆప్ సిందూర్’లో దేశీయ రక్షణ సామర్థ్యం ప్రతిఫలితం
స్టార్టప్‌లు, సూక్ష్మ పరిశ్రమలే వికసిత భారత్‌కు దారితీస్తున్న శక్తి
నార్త్ టెక్ సింపోజియంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు



**ప్రయాగ్‌రాజ్, మే 05 (మన ప్రజాగళం):** భారత రక్షణ రంగంలో స్వదేశీ సామర్థ్యం మరింత బలపడుతోందని కేంద్ర రక్షణ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన నార్త్ టెక్ సింపోజియం 2026లో ఆయన మాట్లాడుతూ, దేశీయ రక్షణ పరిశ్రమల తయారీ సామర్థ్యం ఇప్పుడు సైనిక శక్తికి ప్రధాన బలం అవుతోందని అన్నారు. ‘ఆప్ సిందూర్’ అనే సైనిక కార్యాచరణలో స్వదేశీ ఆయుధాల ప్రభావం స్పష్టంగా కనిపించిందని మంత్రి పేర్కొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతికత, ఆయుధ

మిగతా 2 లో..

## తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు పరుగులు

టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరణ
గవర్నర్‌ను కలిసేందుకు విజయ్ ప్రయత్నాలు
మెజారిటీకి దూరంలో కీలక సమీకరణాలు



**చెన్నై, మే 05 (మన ప్రజాగళం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తమిళగ వెట్రి కజగం పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. దీంతో ఆ పార్టీ అధినేత విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ

మిగతా 2 లో..

## హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు

ఇరాన్ బోట్లపై అమెరికా దాడి
నౌకల రక్షణకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్ చర్యలు
సీజ్‌ఫైర్ భవితవ్యంపై అనిశ్చితి



**వాషింగ్టన్, మే 05 (మన ప్రజాగళం):** హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్‌కు చెందిన ఏడు ఫాస్ట్ బోట్లను పేల్చివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం జలసంధి మూసివేయబడటంతో అక్కడ చిక్కుకున్న నౌకలను సురక్షితంగా తరలించేందుకు అమెరికా చర్యలు చేపట్టింది.యూఏఈ, దక్షిణ కొరియా దేశాలకు చెందిన నౌకలపై దాడులు జరిగినట్లు సమాచారం. ఇరాన్ దాడుల కారణంగా యూఏఈలోని ఫుజైరా ఆయిల్ పోర్టు వద్ద భారీగా మంటలు వ్యాపించినట్లు అధికారులు పేర్కొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అంతర్జాతీయ ఆందోళనలు పెరిగాయి. ప్రాజెక్ట్ ఫ్రీడమ్ పేరుతో అమెరికా కొన్ని నౌకలను హోర్ముజ్ నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నది. ఇందులో భాగంగా మెయర్స్ కంపెనీకి చెందిన భారీ నౌక కూడా విజయవంతంగా జలసంధిని దాటినట్లు వెల్లడించారు. నౌకల భద్రత కోసం ప్రత్యేక చర్యలు

మిగతా 2 లో..

## పంట కొనుగోళ్ల ఆలస్యం

- రైతుల ఆవేదనపై కేటీఆర్ ఆగ్రహం
- యశ్వంతపూర్ ఐకేపీ కేంద్రం పరిశీలన
- 15 రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయినట్టు రైతుల వాపో
- మార్క్‌ఫెడ్ అధికారుల వైఖరిపై నిలదీత



2 లో..

## తెలంగాణలో ఎండల తీవ్రత

- తాత్కాలిక ఉపశమనం, మళ్లీ పెరుగనున్న ఉష్ణోగ్రతలు
- క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో తగ్గిన వేడి
- ఉరుములు, మెరుపులతో వర్షాల సూచన
- మే 8 తర్వాత మళ్లీ పెరిగే ఎండలు



**హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం):** తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచే మండే ఎండ, ఉక్కపోతతో రోజువారీ జీవనం కష్టసాధ్యంగా మారుతోంది. ఉదయం ఏడు గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సుమారు ఒక

మిగతా 2 లో..

విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియెజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.

9390 875876

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమీక్ష

- గంభీరావుపేటలో ప్రభుత్వ యంత్రాంగానికి కీలక దిశానిర్దేశం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన విస్తృత సమీక్ష
- మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో అభివృద్ధి పనుల పురోగతి విశ్లేషణ
- 99 రోజుల కార్యాచరణలో వేగం పెంచాలని స్పష్టమైన ఆదేశాలు




**రాజన్న సిరిసిల్ల, మే 05 (మన ప్రజాగళం ప్రతినిధి):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక “99 రోజుల” కార్యాచరణలో భాగంగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై గంభీరావుపేట మండల కేంద్రంలో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షత వహించగా, ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డా. కవ్వంపల్లి సత్యనారాయణ కూడా హాజరై జిల్లా అభివృద్ధి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు. ముఖ్యంగా మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగం, విద్య, ఆరోగ్య రంగాల్లో చేపడుతున్న పనులపై వివరాలు తెలుసుకున్నారు. పనులు ఎక్కడ ఆలస్యమవుతున్నాయో గుర్తించి వెంటనే వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు సమయానికి చేరేలా అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని

మిగతా 2 లో..

# ఏరోస్పేస్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

**రూ.453 కోట్ల పెట్టుబడితో ఐటీపీ ఏరో ఇండియా ప్రాజెక్ట్**
**2027 నాటికి పూర్తి స్థాయి కార్యకలాపాలు**
**వందలాది నైపుణ్య ఉద్యోగాలకు అవకాశం**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం): తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. షంషాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్ మూడో దశలో ఐటీపీ ఏరో ఇండియా తయారీ కేంద్రానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై పనులను ప్రారంభించారు. సుమారు రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారు. తెలంగాణను ఏరోస్పేస్, ఆధునిక తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ తయారీ కేంద్రం 2027 నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రారంభ దశలోనే సుమారు 350 మంది నైపుణ్య ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనుంది. తరువాతి దశల్లో ఈ సంఖ్య దాదాపు 600కు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆధునిక తయారీ, నాణ్యత నియంత్రణ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్ర యువతకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తూ, సాంకేతికతను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. పారిశ్రామికాభివృద్ధి, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో ఉన్నత విలువైన ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలకంగా మారనుంది.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమీక్ష




(మొదటి పేజీ తరువాయి..)

సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయంతో పనిచేస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపడుతున్న ప్రతి పనికి నిర్దిష్ట గడువు ఉండాలని, ఆ గడువులోపే పూర్తి చేయాలని నేతలు అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపించేలా ఉండాలని తెలిపారు. మొత్తంగా ఈ సమీక్ష సమావేశం ద్వారా జిల్లా అభివృద్ధి పనులకు కొత్త ఉత్సాహం లభించగా, అధికారులు వేగవంతమైన అమలు దిశగా ముందుకు సాగాలని స్పష్టమైన సందేశం అందింది.

# హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి..)

తీసుకుంటున్నారు. అయితే ఈ పరిస్థితికి సైనిక చర్యల ద్వారా పరిష్కారం సాధ్యం కాదని ఇరాన్ మంత్రి అబ్బాస్ అరగాచి తెలిపారు. రాజకీయ పరిష్కారమే అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పరిస్థితి మరింత దిగజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన సీజ్‌ఫైర్ భవితవ్యంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. యూఏఈపై డ్రోన్, మిస్సైల్ దాడుల నేపథ్యంలో ఆ ఒప్పందం అమలులో ఉందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనలపై అమెరికా అడ్మిరల్ బ్రాడ్ కూపర్ స్పందిస్తూ, తమ రక్షణలో ఉన్న నౌకలపై దాడి ప్రయత్నాలను అడ్డుకున్నామని తెలిపారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# పంట కొనుగోళ్ల ఆలస్యం



జనగామ, మే 05 (మన ప్రజాగళం): జనగామ నియోజకవర్గంలోని యశ్వంతపూర్ గ్రామంలో ఉన్న ఐకేపీ పంట కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. పంట కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యంపై రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు 15 రోజులుగా పంట కొనుగోళ్లు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నిసార్లు మార్క్‌ఫెడ్ అధికారులను, కలెక్టర్‌ను సంప్రదించినా స్పందన లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న కేటీఆర్ వెంటనే మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పంట కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రశ్నిస్తూ, మార్క్‌ఫెడ్ వైఫల్యాన్ని తీవ్రంగా విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలనీ, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాలని కోరారు. పంటను అమ్మలేక రైతులు నష్టపోతున్న పరిస్థితిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ స్పందన చూపాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. ఈ పరిశీలనతో రైతుల్లో కొంత ఊరటనిచ్చినట్లు స్థానికులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సాహసానికి నిలువెత్తు ఉదాహరణ

**ఆటో డ్రైవర్ జాహెర్‌కు సీపీ సజ్జనార్ ప్రశంస**

**- గొలుసు దొంగను అడ్డుకున్న ధైర్యం**

**- ప్రాణాలకు తెగించి నిందితుడిని పట్టుకున్న ఆటో డ్రైవర్**

**- ప్రశంసాపత్రం, నగదు బహుమతి ప్రదానం**



హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం): నగరంలో జరిగిన గొలుసు దొంగతనం యత్నాన్ని అడ్డుకుని సాహసం ప్రదర్శించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్‌ను సీపీ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. బేగంబజార్ జిన్సీ చౌరహా ప్రాంతంలో జరిగిన ఈ ఘటన నగరవాసుల్లో చర్చనీయాంశంగా మారింది. మహిళ ఒకరు తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్ చేస్తుండగా రౌడీషీటర్ మహమ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో స్కూటీ అదుపుతప్పి నిందితుడు కిందపడిపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్తున్న ఆటో డ్రైవర్ జాహెర్ అప్రమత్తమయ్యాడు. తక్షణమే తన ఆటోను వెనక్కి తిప్పి నిందితుడిని ఢీకొట్టాడు. దాంతో కోపంతో నిందితుడు కర్రతో జాహెర్‌పై దాడికి ప్రయత్నించినా, అతను వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ఎదుర్కొని నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించాడు. ఈ మొత్తం ఘటన సీసీ కెమెరాల్లో నమోదైంది. గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడిపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సాహసాన్ని గుర్తించిన సీపీ సజ్జనార్ జాహెర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. "నేరం జరుగుతుంటే చూస్తూ ఉండకుండా అడ్డుకోవడం నిజమైన పౌర ధర్మం" అని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో నేరాలను నిర్లక్ష్యం చేసే పరిస్థితుల్లో, జాహెర్ చూపిన ధైర్యం సమాజానికి ఆదర్శమని సీపీ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

# సీఎం స్టాలిన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి..)

ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్న నాయకుడే తన నియోజకవర్గంలో ఓడిపోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. ఇక ఈ ఎన్నికల్లో నటుడు-రాజకీయ నాయకుడు విజయ్ రెండు స్థానాల్లో పోటీ చేసి రెండింటిలోనూ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శక్తి ఎదుగుదలకు సంకేతంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడులో అధికార మార్పిడి దిశగా పరిణామాలు వేగంగా సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాజకీయ సమీకరణాలు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి. ప్రజల తీర్పుతో ఏర్పడిన ఈ మార్పులు భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి.ఐ

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి..)

పెరుగుతున్న నేపథ్యంలో యూఏఈలోని ఫుజైరా పెట్రోలియం ఇండస్ట్రీస్ జోన్పై జరిగిన దాడి పరిస్థితులను మరింత దిగజార్చింది. ఈ ఘటనలో ముగ్గురు భారతీయులు గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "పౌర మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఏ విధంగానూ అంగీకారయోగ్యం కాదు" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. వెంటనే ఈ ఘర్షణలను నిలిపివేయాలని పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం అత్యంత అవసరమని భారత్ పేర్కొంది. సమస్యలను యుద్ధ మార్గంలో కాకుండా దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. అంతర్జాతీయ సమాజం కూడా ఈ దిశగా కృషి చేయాలని కోరింది.

అంతేకాకుండా హర్మూజ్ జలసంధి మీదుగా స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్యం కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని భారత్ అభిప్రాయపడింది. ఈ మార్గం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమని, ఎలాంటి అంతరాయం కలగకూడదని స్పష్టం చేసింది. పరిస్థితులు మరింత విషమించకుండా శాంతియుత పరిష్కారాల కోసం జరుగుతున్న చర్చలకు భారత్ పూర్తి మద్దతు ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు గురిచేస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గి శాంతి నెలకొనేలా దేశాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# స్వదేశీ ఆయుధాలతో సైనిక శక్తి బలోపేతం

(మొదటి పేజీ తరువాయి..)




వ్యవస్థలు యుద్ధ సామర్థ్యాన్ని పెంచుతున్నాయని వివరించారు. స్టార్టప్‌లు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో ఈ సంస్థలు ముందంజలో ఉన్నాయని అన్నారు. దేశ రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని మంత్రి తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతోందని చెప్పారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెరగడం, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరగడం వల్ల పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో భారత్‌ను శక్తివంతమైన రక్షణ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, అందుకు అవసరమైన విధానాలు కొనసాగుతాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# చైనాలో బాణాసంచా ఫ్యాక్టరీ పేలుడు

**21 మంది మృతి, 61 మందికి గాయాలు**

**భారీ స్థాయిలో రెస్క్యూ ఆపరేషన్**

**బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశాలు**

బీజింగ్, మే 05 (మన ప్రజాగళం): చైనాలోని హునాన్ ప్రావిన్స్లో భారీ పేలుడు సంభవించి విషాదాన్ని మిగిల్చింది. హువాషెంగ్ ఫైర్‌వర్క్స్ ప్లాంట్‌లో జరిగిన ఈ ప్రమాదంలో 21 మంది మృతి చెందగా, మరో 61 మంది గాయపడ్డారు. లియుయాంగ్ నగరంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుడు తీవ్రత భారీగా ఉండటంతో సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స అందించేందుకు దాదాపు 500 మంది సిబ్బంది రంగంలోకి దిగారు. ఫ్యాక్టరీలో చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి అత్యాధునిక రోబోలను కూడా ఉపయోగించారు.

ఈ ప్రమాదంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు తీవ్రత కారణంగా సమీప భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న రెండు గన్‌పౌడర్ గోదాములు రెస్క్యూ చర్యలకు అడ్డంకిగా మారినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫైర్‌వర్క్స్ కంపెనీ ఇన్‌చార్జిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పందించి వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ దుర్ఘటన చైనాలో పారిశ్రామిక భద్రతపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు పరుగులు

(మొదటి పేజీ తరువాయి..)

నేపథ్యంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు విజయ్ లేఖ రాశారు. లోక్‌భవన్‌కు ఈమెయిల్ పంపి, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం ఇవ్వాలని కోరారు. 108 స్థానాలతో తమ పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అయితే శాసనసభలో మెజారిటీ నిరూపణకు మరింత సమయం ఇవ్వాలని విజయ్ తన లేఖలో విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. 15 రోజుల్లో తమ సంఖ్యా బలం చూపిస్తామని, తగిన అవకాశాన్ని కల్పించాలని కోరారు. లోక్‌భవన్ వర్గాల సమాచారం ప్రకారం, విజయ్‌కు త్వరలోనే గవర్నర్ నుంచి ఆహ్వానం వచ్చే అవకాశం ఉంది. బలనిరూపణకు 7 నుంచి 15 రోజుల గడువు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు కోసం అవసరమైన మెజారిటీ 118 స్థానాలు కాగా, టీవీకే ఆ సంఖ్యకు 10 సీట్ల దూరంలో నిలిచింది. దీంతో ఇతర పార్టీల మద్దతు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎవరు టీవీకేకు మద్దతు ఇస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది. టీవీకే శాసనసభా పక్ష నాయకుడిగా విజయ్‌ను ఎమ్మెల్యేలు ఎన్నుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణలో ఎండల తీవ్రత

(మొదటి పేజీ తరువాయి..)

డిగ్రీ మేర తగ్గినట్లు పేర్కొన్నారు. రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ కారణంగా తాత్కాలికంగా కొంత ఉపశమనం లభించే అవకాశముందని చెప్పారు. ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షపాతం ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. అయితే ఈ ఉపశమనం తాత్కాలికమేనని అధికారులు స్పష్టం చేశారు. మే 8వ తేదీ నుంచి మళ్లీ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశముందని హెచ్చరించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత నుంచి రక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు.

మన ప్రజా గళం తెలుగు దిన పత్రిక



## సంపాదకీయం

# ద్రవిడ రాజకీయాల్లో నవశకం: విజయ్ ప్రభంజనం

**తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ సంచలన విజయం**

**దశాబ్దాల ఆధిపత్యానికి తెరదించిన సినీ నటుడి రాజకీయ ప్రస్థానం**

**ప్రజా తీర్పుతో మారుతున్న దక్షిణ భారత రాజకీయ ముఖచిత్రం**



తమిళనాడు రాజకీయ చరిత్రలో నిన్నటి ఫలితాలు ఒక చారిత్రక మలుపుగా నిలిచిపోతాయి. దశాబ్దాలుగా డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల మధ్య సాగుతున్న ద్విధ్రువ రాజకీయాలకు నటుడు విజయ్ తెరదించారు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తొలి ఎన్నికల్లోనే 108 స్థానాలను కైవసం చేసుకోవడం ఒక అద్భుతం. సినీ గ్లామర్‌తో పాటు పక్కా రాజకీయ ప్రణాళిక ఉండటం వల్లే ఈ విజయం సాధ్యమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కొత్త తరం నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని చాలా నిశ్శబ్దంగా, వ్యూహాత్మకంగా ప్రారంభించారు. పార్టీని ప్రకటించిన రోజు నుండి క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు. అభిమాన సంఘాలను రాజకీయ శ్రేణులుగా మార్చడంలో ఆయన విజయం సాధించారు. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లు విజయ్ వెంటే ఉన్నారని ఎన్నికల గణాంకాలు చెబుతున్నాయి. సినీ రంగంలో ఉన్న క్రేజ్ కేవలం ఓట్లుగా మారుతుందా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆయన తన సత్తా చాటారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలపై స్పందించడం ఆయనకు కలిసి వచ్చింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం ఈ ఎన్నికల్లో అతి పెద్ద ఆశ్చర్యకరమైన విషయం. ఒక పార్టీకి తిరుగులేని మెజారిటీ రాకపోవడంతో హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించడం వల్ల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యత విజయ్ భుజాలపై ఉంది. ఇతర పార్టీల మద్దతు కూడగట్టడంలో ఆయన చూపే చొరవపైనే తమిళనాడు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అధికార పక్షం వైఫల్యాలు, ప్రతిపక్షాల అసమర్థత విజయ్ గెలుపుకు మార్గం సుగమం చేశాయి. ఇది కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, ఒక కొత్త ఆలోచన గెలుపు. సాధారణంగా నటులు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు కేవలం వారి గ్లామర్ మీద ఆధారపడతారు. కానీ విజయ్ తన మేనిఫెస్టోలో సామాజిక న్యాయం, విద్య, వైద్యం వంటి అంశాలకు పెద్దపీట వేశారు. ద్రవిడ సిద్ధాంతాలకు తనదైన శైలిలో కొత్త నిర్వచనం ఇచ్చారు. అవినీతి రహిత పాలన అందిస్తామనే హామీ ప్రజల్లో బలంగా వెళ్లింది. క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం ఎదురుచూస్తున్న తమిళ తంబీలకు విజయ్ ఒక ఆశాకిరణంగా కనిపించారు. భావోద్వేగాలతో పాటు వాస్తవిక సమస్యలను చర్చించడం వల్ల ఆయన ఓట్లు సాధించగలిగారు. ఈ విజయం పొరుగు రాష్ట్రాల్లో ఉన్న సినీ ప్రముఖులకు కూడా ఒక కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. ప్రజాక్షేత్రంలో పట్టు ఉంటే రాజకీయాల్లో ఏదైనా సాధించవచ్చని విజయ్ నిరూపించారు. ద్రవిడ రాజకీయాల కోటను బద్దలు కొట్టడం అంత సులభం కాకపోయినా, ఆయన తన పట్టుదలతో అది సాధించి చూపారు. ఇప్పుడు ఆయన ముందు ఉన్న సవాలు సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించడం. కూటమి రాజకీయాలను నేర్పుగా నడిపిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. సంక్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో ఆయన నిర్ణయాలు ఎలా ఉంటాయనేది ఉత్కంఠగా మారింది. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి వారు సినీ రంగం నుండి వచ్చి రాజకీయాలను శాసించారు. ఇప్పుడు అదే బాటలో విజయ్ ప్రస్థానం సాగుతోంది. అయితే ఇప్పటి పరిస్థితులు అప్పటికంటే భిన్నంగా ఉన్నాయి. సోషల్ మీడియా వాడకం, పెరిగిన రాజకీయ అవగాహన మధ్య ఆయన తన ఉనికిని చాటుకోవాల్సి వచ్చింది. టీవీకే పార్టీ సాధించిన ఓట్ల శాతం గమనిస్తే అది అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తెలుస్తోంది. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భవిష్యత్తులో ఇతర జాతీయ పార్టీలకు కూడా ఒక పాఠం కానుంది. ప్రస్తుతం తమిళనాడులో చర్చల పర్వం మొదలైంది. ఏ పార్టీ మద్దతు లేకుండా టీవీకే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కష్టం. స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల మద్దతు కోసం విజయ్ సంప్రదింపులు జరుపుతున్నారు. అధికార పీఠం ఎక్కడం కంటే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే ఆయన ప్రాధాన్యత కావాలి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఇప్పుడు కొత్త ప్రభుత్వంపై ఉంది. ప్రజల ఆశలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి, వాటిని అందుకోవడంలో విజయ్ ఎంతవరకు సఫలమవుతారో చూడాలి. ముగింపుగా చెప్పాలంటే విజయ్ గెలుపు తమిళనాడు రాజకీయాల్లో ఒక నవశకాన్ని ప్రారంభించింది. పాత తరం రాజకీయాలకు కాలం చెల్లిందని, ప్రజలు కొత్త రక్తాన్ని కోరుకుంటున్నారని ఈ ఫలితాలు నిరూపించాయి. సినీ తెరపైనే కాకుండా రాజకీయ తెరపై కూడా విజయ్ అసలైన 'దళపతి' అనిపించుకున్నారు. రాబోయే ఐదేళ్లు తమిళనాడు అభివృద్ధి పథంలో నడవాలని అందరూ కోరుకుంటున్నారు. ఈ చారిత్రక విజయం ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్యుడి ఓటుకున్న శక్తిని మరోసారి గుర్తు చేసింది. మార్పు మొదలైంది, అది గమ్యాన్ని చేరుకోవాలని ఆశిద్దాం.

## లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

- ఏసీబీ వలలో శరత్ కుమార్
- రూ.20 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత
- ఎన్‌ఓసీ, ఆస్తి విలువ సర్టిఫికేట్ కోసం డిమాండ్
- ఫిర్యాదుదారులకు టోల్ ఫ్రీ 1064కు కాల్ చేయాలని ఏసీబీ సూచన



**రంగారెడ్డి, మే 05 (మన ప్రజాగళం):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. శరత్ కుమార్ లంచం స్వీకరిస్తూ ఏసీబీ అధికారుల చేతిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ తెలంగాణ అధికారులు ఈ చర్యను చేపట్టారు. వివరాల ప్రకారం, శరత్ కుమార్ మొదట ఫిర్యాదుదారుని నుంచి రూ.30,000 లంచం డిమాండ్ చేయగా, తరువాత దాన్ని రూ.20,000కు తగ్గించి స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుని సైట్ వివరాలను ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి, ఎన్‌ఓసీ మరియు ఆస్తి విలువ సర్టిఫికేట్ జారీ చేయడానికి ఈ లంచం తీసుకున్నట్లు వెల్లడించారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్‌లో శరత్ కుమార్ నుంచి రూ.20,000 లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే స్పందించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అవినీతి నిరోధానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు.

# రైతులకు అండగా ప్రభుత్వం..

**. వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి**

**యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా స్థాయి సమీక్ష**

**కేంద్రాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు**

**అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన**




**జగిత్యాల, మే 05 (మన ప్రజాగళం):** రైతులకు అండగా నిలుస్తూ వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాసంగి (రబీ) 2025–26 వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో దాదాపు 440 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. కొనుగోళ్లలో ఎక్కడైనా జాప్యం ఉంటే కారణాలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. గన్నీ సంచుల కొరత లేదని, 60 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు వివరించారు. జిల్లాలో హమాలీలు, లారీలు కొరత ఉన్నట్లు గమనించామని, లారీలు అందుబాటులో లేకపోతే ట్రాక్టర్లను వినియోగించాలని సూచించారు. హమాలీల కొరత ఉంటే ఉపాధి హామీ కూలీలను ఉపయోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద సమస్యలు ఉంటే ప్రత్యామ్నాయ మిల్లులను కేటాయిస్తామని పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం నష్టపోకుండా కొనుగోళ్లు వేగంగా పూర్తి చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి ధాన్యాన్ని రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో రైస్ మిల్లుల యజమానులు, ట్రాన్స్పోర్ట్ యాజమాన్యాలు, వివిధ శాఖల అధికారులు కొనుగోలు ప్రక్రియ, స్థానిక సమస్యలపై వివరాలు వెల్లడించారు. జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, డీఎస్ఓ జితేందర్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.



# గ్రామీణ ఉపాధి విస్తరణకు ప్రభుత్వం దిశానిర్దేశం

- కూలీల సంఖ్య 15 లక్షలకు పెంపు లక్ష్యం
- ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని మంత్రి సీతక్క ఆదేశాలు
- గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష
- పంచాయతీల విద్యుత్ బకాయిల క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి



**వరంగల్, మే 05 (మన ప్రజాగళం):** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచే దిశగా సమగ్ర చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో రోజుకు సుమారు 9 లక్షల మంది కూలీలు పాల్గొంటున్నారని, ఈ సంఖ్యను తక్షణం 15 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పనుల ప్రణాళికను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన అనుమతులు, సాంకేతిక ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి మరిన్ని పనిదినాలు సృష్టించాలని మంత్రి సూచించారు. కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రతి జిల్లాలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా పరిషత్ సీఈఓలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ, సెర్ప్, ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరంగా పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై మంత్రి కఠినంగా స్పందించారు. అనుమతించిన పనులకే నిధులను వినియోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించిన ఘటనలపై వెంటనే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను అత్యవసరంగా చెల్లించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1590 కోట్ల మేర బకాయిలు ఉండటం ఆందోళనకరమని, వీటిని క్లియర్ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలులో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలలో సాధించిన పనిదినాలను అభినందిస్తూ, మే నెలలో పూర్తి లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఈఎన్‌సీ జోగారెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

# గోవుల రక్షణలో చట్టాలు అతిక్రమించవద్దు

- కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- గో రక్షణ కమిటీలతో సమావేశం
- అక్రమ రవాణా నియంత్రణపై మార్గదర్శకాలు
- పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచన




**వరంగల్, మే 05 (మన ప్రజాగళం):** గోవులను రక్షించే క్రమంలో ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టాలను అతిక్రమించవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గో రక్షణ కమిటీలకు సూచించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ అంశంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మూగజీవాల అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై గో రక్షణ సమితి సభ్యులతో చర్చించారు. కమిషనరేట్ పరిధిలో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాల తనిఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బలగాలను నియమించినట్లు పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గో రక్షణ పేరుతో ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. అక్రమ రవాణా వాహనాలను వెంబడిస్తూ వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని వివరించారు. అలాగే నిందితులు దాడులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో సభ్యులు తమ ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్థానిక గో రక్షణ కమిటీ సభ్యులు తమ ఫోన్ నంబర్లను పోలీసులతో పంచుకోవాలని సూచించారు. దీనివల్ల తప్పుడు కాల్స్‌ను అడ్డుకోవడంతో పాటు, త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గోవుల అక్రమ రవాణా కేసుల్లో చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిసిపిలు, ఏసిపిలు, పోలీసు అధికారులు, గో రక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శ్రీకారం

**రూ.2360 కోట్లతో మెగా పారిశ్రామిక ప్రాజెక్ట్**

**ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన**

**లక్షలాది ఉద్యోగాలకు దారి చూపనున్న సిటీ**



**హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం):** తెలంగాణలో పారిశ్రామిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు మే 10న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్--నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మొత్తం రూ.2360.54 కోట్ల వ్యయంతో అమలు కానుంది. సుమారు 3,245 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్మార్ట్ సిటీ ఆధునిక మౌలిక వసతులతో కూడిన సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2029 నాటికి దాదాపు 1.74 లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, లోహాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్మార్ట్ టెక్నాలజీతో కూడిన మౌలిక వసతులు, పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి. ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక సదుపాయాలతో పాటు నివాస, వాణిజ్య ప్రాంతాలు, పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వంటి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. వ్యూహాత్మకంగా హైదరాబాద్--నాగ్‌పూర్ కారిడార్‌లో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుంది. పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిని వేగవంతం చేస్తూ భారత్‌ను గ్లోబల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు నాంది పలకనుంది.

# రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

**జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధర్నా**



**( ఆత్మకూరు, మన ప్రజాగళం ):** ఆత్మకూరు మార్కెట్ యార్డును మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సందర్శించారు. మక్కల కొనుగోలు కేంద్రంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించిన ఆయన, వెంటనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు, కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న ముఖ్య నాయకులు: ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు మాజీ ఎంపీటీసీ బీరం రజినీకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కేశవరెడ్డి, కాంతల రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వీసం శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు కీసరి రాజిరెడ్డి మరియు ఇతర నాయకులు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# పెద్దపల్లిలో మహా ఉద్యోగ మేళా.

**.. వేలాది అవకాశాలు - మే 6న నిర్వహణకు సిద్ధం - 68 సంస్థల్లో 3439 ఉద్యోగాలు - యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపు**

**పెద్దపల్లి, మే 05 (మన ప్రజాగళం):** జిల్లా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మే 6న మహా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా పరిపాలన యంత్రాంగం, తెలంగాణ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మావతి శీతలీకృత సమావేశ మందిరంలో ఈ ఉద్యోగ మేళా జరగనుంది. ఇందులో సుమారు 20 స్థానిక సంస్థలు, 48 ఇతర సంస్థలు కలిపి మొత్తం 68 సంస్థలు పాల్గొననున్నాయి. వీటి ద్వారా సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దూరసంచార సేవలు, వినియోగదారుల సహాయ కేంద్రాలు, విక్రయాలు, ప్రచారం, డిజిటల్ సేవలు, ఫీల్డ్ సేవల వంటి విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు లభ్యమవుతాయని తెలిపారు. వేతనాలు రూ.18 వేల నుంచి రూ.80 వేల వరకు ఉండే అవకాశముందని పేర్కొన్నారు. పదవ తరగతి, అంతర్, పారిశ్రామిక శిక్షణ, డిప్లొమా, డిగ్రీ, ఔషధ విద్య, ఇంజినీరింగ్, నిర్వహణ విద్య వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ జీవన వివరాలు, ఆధార్ కార్డు, జిల్లా ఉపాధి పోర్టల్ నమోదు వివరాలతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.



# గాల్లోనే ఆరిపోతున్న గౌడన్నల జీవితాలు

**జయశంకర్ భూపాలపల్లి, (మన ప్రజాగళం):**

**- తాటి చెట్టు నుంచి పడి గౌడ్ మృతి**

**- వృత్తి ప్రమాదాలతో కుటుంబాలు వీధిన**

**- గౌడ సమాజం నుంచి పరిహారం డిమాండ్**





గౌడ వృత్తిలో ప్రమాదాలు మరొక కుటుంబాన్ని దెబ్బతీశాయి. మొగుళ్ళపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన నేరెళ్ల మొగిలి గౌడ్ (50) తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం, తన దైనందిన వృత్తిలో భాగంగా తాటి చెట్టెక్కిన మొగిలి గౌడ్ ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులను కన్నీటి పర్యంతం చేసింది. గౌడ వృత్తిని ఆధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్న అనేక మంది ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటి చెట్లపైకి ఎక్కడం ఎంతో ప్రమాదకరమైన పని అయినప్పటికీ జీవనాధారం కోసం గౌడన్నలు ప్రాణాలకు తెగిస్తున్నారు. ఈ తరహా ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఒక్కసారిగా ఆదరణ కోల్పోయి వీధిన పడుతున్నాయని గౌడ సమాజం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఈ వృత్తిలో ఉన్నవారికి భద్రత కల్పించాలని కోరుతున్నారు. మృతి చెందిన మొగిలి గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గౌడన్నల వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. గౌడన్నల జీవన భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని గౌడ సమాజం స్పష్టం చేసింది.

# జహీరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం... ఇద్దరు మృతి

**- ట్రాలీ ఆటోను ఢీకొట్టిన కారు**

**- ముగ్గురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు**

**- పుణ్యక్షేత్రం నుంచి వస్తుండగా విషాదం**




**సంగారెడ్డి, మే 05 (మన ప్రజాగళం):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతానికి చెందిన వారు మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ భవానీ దేవాలయం దర్శించుకుని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జహీరాబాద్ బైపాస్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన ముగ్గురిని వెంటనే జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను చేవెళ్ల ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పుణ్యక్షేత్రం నుంచి సంతోషంగా తిరిగి వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనతో మరోసారి రోడ్డు భద్రతపై జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉన్నదని అధికారులు పేర్కొన్నారు.

# రైతు వారోత్సవాలకు ఘన ప్రారంభం... కలెక్టర్ రాజర్షిషా

**- హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో కార్యక్రమం**

**- రైతులకు విత్తన కిట్లు, ఒప్పంద పత్రాల పంపిణీ**

**- ఉద్యాన రంగ అభివృద్ధికి చర్యలు**

**ఆదిలాబాద్, మే 05 (మన ప్రజాగళం):**



ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక “99 రోజుల” కార్యాచరణలో భాగంగా స్థానిక హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో నిర్వహించిన ‘రైతు వారోత్సవాలు’ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘనంగా ప్రారంభించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల విత్తనాల కిట్లు, ఆయిల్ ఫామ్ అగ్రిమెంట్ పత్రాలను అందజేశారు. రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఉద్యాన పంటల అభివృద్ధి ద్వారా రైతులకు మరింత లాభాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సుగంధ ద్రవ్యాల స్టాల్‌ను కలెక్టర్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రైతులు వివిధ పంటల సాగులో నూతన పద్ధతులను అవలంబించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య, వివిధ మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతు వారోత్సవాల ద్వారా రైతులకు అవగాహన పెంచి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు.

# గచ్చిబౌలి వార్డులో సమస్యలపై కమిషనర్ సమీక్ష

**‘ఒక రోజు -- ఒక వార్డు’ కార్యక్రమం కొనసాగింపు**

**మణికొండ చెరువు కాలుష్యం, మౌలిక వసతులపై చర్చ**

**విభాగాలకు ప్రాధాన్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు**



**హైదరాబాద్, మే 05 (మన ప్రజాగళం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ‘ఒక రోజు -- ఒక వార్డు’ కార్యక్రమం భాగంగా ఏడవ రోజు ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెరిలింగంపల్లి జోన్‌లోని గచ్చిబౌలి వార్డును కమిషనర్ సందర్శించి, స్థానిక ప్రజలు, నివాస సంఘాలతో చర్చలు జరిపారు. ఈ పర్యటనలో పలు విభాగాలకు సంబంధించిన సమస్యలు వెలుగులోకి వచ్చాయి. పర్యావరణ విభాగం కింద మణికొండ చెరువులో పెరుగుతున్న కాలుష్యం ప్రధాన అంశంగా చర్చకు వచ్చింది. దీర్ఘకాలిక పరిష్కారాల కోసం ఎస్టీపీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, చెరువు పరిసరాలను అభివృద్ధి చేయాలని నివాసులు కోరారు. పార్కులు, ఖాళీ ప్రదేశాల అభివృద్ధిపై కూడా ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గుర్తించిన ఖాళీ ప్రదేశాలను సక్రమ సదుపాయాలతో పార్కులుగా అభివృద్ధి చేయాలని సూచించారు. అదే సమయంలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన ఎస్ఎన్‌డీపీ రెండో దశలో పెండింగ్‌లో ఉన్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని కోరారు. టౌన్ ప్లానింగ్ అంశంలో రోడ్లపై ప్రైవేట్ నిర్మాణాల ఆక్రమణలు సమస్యగా మారినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్శనలో పచ్చదనం పెంపు భాగంగా మొక్కలు నాటడం జరిగింది. నివాస సంఘాలు చురుకుగా పాల్గొని తమ ప్రాంత సమస్యలను వివరించారు. అదేవిధంగా వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం నాలుగు విధాలుగా చెత్త వర్గీకరణ అమలు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జనగణన స్వీయ నమోదు ప్రక్రియలో పాల్గొనాలని పౌరులను ప్రోత్సహించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేసి ప్రజలకు స్పష్టమైన మార్పులు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటన ద్వారా ప్రజలతో నేరుగా మమేకమవుతూ పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలనే లక్ష్యం స్పష్టమైంది.

# గులాబీ తోరణాల తొలగింపు పై ఆగ్రహం

- జీడబ్ల్యూఎంసీ చర్యలపై బీఆర్ఎస్ నిరసన
- గ్రేటర్ కార్యాలయం ఎదుట ధర్నా, నినాదాలు
- ప్రతిపక్షాన్ని అణచివేతకు ప్రయత్నం అంటూ ఆరోపణలు



**వరంగల్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన గులాబీ తోరణాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది తొలగించడంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఈ ఘటనకు నిరసనగా గులాబీ శ్రేణులు గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భద్రతను పెంచారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కావాలనే ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శలు గుప్పించారు. గులాబీ జెండా ఎగిరినా, కేసీఆర్ సైన్యం కనిపించినా కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని వ్యాఖ్యానించారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న మద్దతు చూసి ఇలాంటి చర్యలకు దిగుతోందని అన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైతుల పక్షాన, తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పార్టీ శక్తిని అణచివేయాలనే ప్రయత్నాలు ఫలించవని హెచ్చరించారు. ఈ నిరసనతో వరంగల్ నగరంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి శాంతి భద్రతలను కాపాడారు.

# గాల్లోనే ఆరిపోతున్న గౌడన్నల జీవితాలు

- తాటి చెట్టు నుంచి పడి గౌడ్ మృతి



**జయశంకర్ భూపాలపల్లి, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** గౌడ వృత్తిలో ప్రమాదాలు మరొక కుటుంబాన్ని దెబ్బతీశాయి. మొగుళ్ళపల్లి మండలం పిడిసిల్ల గ్రామానికి చెందిన నేరెళ్ల మొగిలి గౌడ్ (50) తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం, తన దైనందిన వృత్తిలో భాగంగా తాటి చెట్టెక్కిన మొగిలి గౌడ్ ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులను కన్నీటి పర్యంతం చేసింది. గౌడ వృత్తిని ఆధారంగా చేసుకుని కుటుంబాలను పోషిస్తున్న అనేక మంది ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటి చెట్లపైకి ఎక్కడం ఎంతో ప్రమాదకరమైన పని అయినప్పటికీ జీవనాధారం కోసం గౌడన్నలు ప్రాణాలకు తెగిస్తున్నారు. ఈ తరహా ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఒక్కసారిగా ఆదరణ కోల్పోయి వీధిన పడుతున్నాయని గౌడ సమాజం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ఈ వృత్తిలో ఉన్నవారికి భద్రత కల్పించాలని కోరుతున్నారు. మృతి చెందిన మొగిలి గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గౌడన్నల వృత్తిలో ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. గౌడన్నల జీవన భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని గౌడ సమాజం స్పష్టం చేసింది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



**జనగామ, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం రఘునాథపల్లి మండల పరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, కంచనపల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాంటాలు సకాలంలో పూర్తవుతున్నాయా, ధాన్యం బస్తాలను లారీల ద్వారా మిల్లులకు సమయానికి తరలిస్తున్నారా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించారు. తాడిపత్రులు, గన్నీ బ్యాగులు సమృద్ధిగా ఉన్నాయా, రవాణా ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నాయా అన్న విషయాలను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు వేచి ఉండే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని, తేమ శాతం ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని స్వీకరించాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతను పాటిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అనంతరం రఘునాథపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. సిబ్బంది హాజరు, మందుల లభ్యత, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయానికి విధులకు హాజరై నాణ్యమైన సేవలు అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# గచ్చిబౌలి వార్డులో సమస్యలపై కమిషనర్ సమీక్ష

- 'ఒక రోజు -- ఒక వార్డు' కార్యక్రమం కొనసాగింపు
- మణికొండ చెరువు కాలుష్యం, మౌలిక వసతులపై చర్చ
- విభాగాలకు ప్రాధాన్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



**హైదరాబాద్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'ఒక రోజు -- ఒక వార్డు' కార్యక్రమం భాగంగా ఏడవ రోజు ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెరిలింగంపల్లి జోన్‌లోని గచ్చిబౌలి వార్డును కమిషనర్ సందర్శించి, స్థానిక ప్రజలు, నివాస సంఘాలతో చర్చలు జరిపారు. ఈ పర్యటనలో పలు విభాగాలకు సంబంధించిన సమస్యలు వెలుగులోకి వచ్చాయి. పర్యావరణ విభాగం కింద మణికొండ చెరువులో పెరుగుతున్న కాలుష్యం ప్రధాన అంశంగా చర్చకు వచ్చింది. దీర్ఘకాలిక పరిష్కారాల కోసం ఎస్టీపీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, చెరువు పరిసరాలను అభివృద్ధి చేయాలని నివాసులు కోరారు. పార్కులు, ఖాళీ ప్రదేశాల అభివృద్ధిపై కూడా ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. గుర్తించిన ఖాళీ ప్రదేశాలను సక్రమ సదుపాయాలతో పార్కులుగా అభివృద్ధి చేయాలని సూచించారు. అదే సమయంలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన ఎస్ఎన్‌డీపీ రెండో దశలో పెండింగ్‌లో ఉన్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని కోరారు. టౌన్ ప్లానింగ్ అంశంలో రోడ్లపై ప్రైవేట్ నిర్మాణాల ఆక్రమణలు సమస్యగా మారినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలు ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్శనలో పచ్చదనం పెంపు భాగంగా మొక్కలు నాటడం జరిగింది. నివాస సంఘాలు చురుకుగా పాల్గొని తమ ప్రాంత సమస్యలను వివరించారు. అదేవిధంగా వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం నాలుగు విధాలుగా చెత్త వర్గీకరణ అమలు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. జనగణన స్వీయ నమోదు ప్రక్రియలో పాల్గొనాలని పౌరులను ప్రోత్సహించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలో పనులను పూర్తి చేసి ప్రజలకు స్పష్టమైన మార్పులు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటన ద్వారా ప్రజలతో నేరుగా మమేకమవుతూ పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలనే లక్ష్యం స్పష్టమైంది.



# ప్రతిభావంతుల విద్యార్థులకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సత్కారం

- మిరుదొడ్డి మండలంలో ఘన కార్యక్రమం
- 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు
- విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సూచన





**దుబ్బాక, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్రంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. రామాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నా పట్టుదలతో చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. సరైన మౌలిక వసతులు, సదుపాయాలు అందించడంలో లోపాలు ఉన్నప్పటికీ విద్యార్థులు వాటిని అధిగమించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. పరీక్షల్లో ఆశించిన ఫలితాలు రాకపోయినా నిరుత్సాహపడవద్దని, జీవితంలో ఇంకా ఎన్నో అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# సేవాభావంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- నర్సింగ్ విద్యార్థుల ఘన వీడ్కోలు కార్యక్రమం
- సేవా మనోభావం, మానవత్వం కీలకమని సూచన
- ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం



**జోగులాంబ గద్వాల, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. గద్వాలలోని అనంత ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేసి, ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నర్సింగ్ వృత్తి ప్రాముఖ్యతను గుర్తుచేశారు. నాలుగేళ్ల పాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు భవిష్యత్తులో సేవాభావం, సహానుభూతితో రోగులకు సేవలందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా నుంచి మొదటి బ్యాచ్‌గా విద్యార్థులు బయటకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. మొత్తం 87 మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేయడం అభినందనీయమని చెప్పారు. ఆసుపత్రుల్లోనే కాకుండా ఇంటి వద్ద చికిత్స అవసరమైన వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి సేవలు అందించే అవకాశాలు నర్సులకు ఉన్నాయని తెలిపారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకుని రోగుల మానసిక స్థితికి అనుగుణంగా సేవలు అందిస్తే మంచి గుర్తింపు పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆరోగ్య రంగంలో నర్సింగ్ సేవలకు ఎలాంటి లోటు ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ వృత్తికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గద్వాలలో నిర్మించిన నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన సముదాయాన్ని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- కొనుగోలు కేంద్రం పరిశీలన
- రైతులకు సౌకర్యాలపై సమీక్ష
- అకాల వర్షాల నేపథ్యంలో రక్షణ చర్యలు





**భద్రాద్రి కొత్తగూడెం,మే 05 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామ పరిధిలోని పెద్దపల్లి--ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షిస్తూ టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ధాన్యం లోడింగ్ వేగవంతం చేయడానికి తగినన్ని లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా రైతులకు నష్టం కలగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని సురక్షితంగా కాపాడాలని, తేమ శాతాన్ని ప్రమాణాల ప్రకారం పరిశీలించాలని సూచించారు.కొనుగోలు పూర్తయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు నమోదు చేయాలని, ఆలస్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, వ్యవసాయ అధికారి లావణ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పార్కింగ్ సమస్యలకు వినూత్న పరిష్కారం

- ఆసిఫాబాద్‌కు జాతీయ గుర్తింపు
- “పార్కింగ్ మేనేజ్‌మెంట్ ఇన్ క్రౌడెడ్ ప్లేసెస్” డిజైన్‌కు పేటెంట్ నమోదు
- విద్యార్థుల ఆవిష్కరణకు కేంద్ర పేటెంట్ కార్యాలయం మన్ననలు
- యువతకు ప్రేరణగా నిలిచిన ఆసిఫాబాద్ విద్యార్థులు



**కుమరం భీమ్ ఆసిఫాబాద్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాకు గర్వకారణమైన ఘనత లభించింది. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యలకు వినూత్న పరిష్కారం చూపించే “పార్కింగ్ మేనేజ్‌మెంట్ ఇన్ క్రౌడెడ్ ప్లేసెస్” అనే డిజైన్‌కు భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం నుండి అధికారిక నమోదు లభించింది. ఈ ఆవిష్కరణకు రిజిస్ట్రేషన్ నంబర్ 486267-001 కేటాయించగా, 2026 జనవరి 5న నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ వినూత్న డిజైన్‌ను మౌల్కారి కేశవ్, అల్సా మమత, కటుకం మధుకర్ కలిసి అభివృద్ధి చేశారు. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు సాంకేతిక పరిష్కారం అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపొందించబడింది. ముఖ్యంగా రద్దీ ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ఇది ఉపయోగపడనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత విద్యార్థిని అల్సా మమతను, సహకరించిన ఉపాధ్యాయులు మౌల్కారి కేశవ్, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్‌ను అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి లలిత కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థిని అల్సా మమత ఈ ప్రాజెక్ట్ గురించి వివరించుతూ, రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ నిర్వహణను సులభతరం చేయడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సమర్థవంతమైన పార్కింగ్ విధానాలను అమలు చేయవచ్చని చెప్పారు.జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇక భవిష్యత్తులో ‘నో పార్కింగ్’ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే అధికారులకు వెంటనే సమాచారం చేరే విధంగా డివైస్‌ను రూపొందించాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే దిశగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ బి. సత్యప్రసాద్
- మల్యాల కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ
- అకాల వర్షాల నేపథ్యంలో రక్షణ చర్యలపై సూచనలు



**జగిత్యాల, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మల్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు వేచి చూసే పరిస్థితి రాకుండా కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్ఫాలిన్ కవర్లు సరిపడా అందుబాటులో ఉంచుకుని ధాన్యాన్ని రక్షించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం నష్టం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ఆన్లైన్ డాటా ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మిల్లుల వద్ద ధాన్యం త్వరగా అన్‌లోడింగ్ అయ్యేలా సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడే సమయంలో రైతులు చెట్ల కింద, కరెంట్ పోల్స్ వద్ద ఉండకూడదని అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



# ఉప్పల్‌లో కమిషనర్ ఫీల్డ్ విజిట్

- పౌర సేవలపై దృష్టి
- పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు
- దోమల నివారణ, ప్రజారోగ్యంపై సమీక్ష
- తక్షణ చర్యలతో మెరుగైన సేవల లక్ష్యం







**హైదరాబాద్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** ఉప్పల్ ప్రాంతంలో కమిషనర్ నిర్వహించిన ఫీల్డ్ విజిట్‌లో పలు కీలక అంశాలపై సమీక్ష జరిగింది. పచ్చని వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు, బలమైన కమ్యూనిటీ అభివృద్ధి లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్న దోమల సమస్యపై నియంత్రణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే వ్యాపార సంస్థలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అన్న అంశంపై కూడా తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్సులు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.ప్రాంతాల వారీగా తనిఖీలు నిర్వహిస్తూ సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యమని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నగర అభివృద్ధి సాధ్యమని అధికారులు పేర్కొన్నారు. స్థానికులు కూడా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో సహకరించాలని కోరారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా ఉప్పల్ ప్రాంతంలో పౌర సేవలు మరింత మెరుగుపడేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

- నిర్మల్ జిల్లాలో సమీక్ష సమావేశం



**నిర్మల్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సిఎంఆర్ డెలివరీలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దశలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి అవసరమైన ధాన్యం నిల్వలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమయానికి సిఎంఆర్ డెలివరీ పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు సాధ్యమవుతాయని, ప్రజలకు అవసరమైన సరఫరాలు అంతరాయం లేకుండా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# రైతు వారోత్సవాలకు ఘన ప్రారంభం కలెక్టర్ రాజర్షిషా

- హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో కార్యక్రమం
- రైతులకు విత్తన కిట్లు, ఒప్పంద పత్రాల పంపిణీ
- ఉద్యాన రంగ అభివృద్ధికి చర్యలు



**ఆదిలాబాద్, మే 05 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక “99 రోజుల” కార్యాచరణలో భాగంగా స్థానిక హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో నిర్వహించిన ‘రైతు వారోత్సవాలు’ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఘనంగా ప్రారంభించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా రైతులకు కూరగాయల విత్తనాల కిట్లు, ఆయిల్ ఫామ్ అగ్రిమెంట్ పత్రాలను అందజేశారు. రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఉద్యాన పంటల అభివృద్ధి ద్వారా రైతులకు మరింత లాభాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సుగంధ ద్రవ్యాల స్టాల్‌ను కలెక్టర్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రైతులు వివిధ పంటల సాగులో నూతన పద్ధతులను అవలంబించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నర్సయ్య, వివిధ మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతు వారోత్సవాల ద్వారా రైతులకు అవగాహన పెంచి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు.

# హెల్త్

## పండ్లతో ఆరోగ్యం రోజుకు ఒక ఆపిల్ ఎందుకు అవసరం?

- శరీరానికి శక్తినిచ్చే సహజ ఆహారం
- వ్యాధులను దూరం చేసే పండు
- రోజువారీ ఆహారంలో తప్పనిసరి




ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. వాటిలో ఆపిల్ ప్రత్యేక స్థానం పొందింది. రోజుకు ఒక ఆపిల్ తింటే వైద్యుడిని దూరంగా ఉంచవచ్చని పాత నానుడి కూడా ఉంది. ఈ పండులో ఉండే పోషకాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఆపిల్‌లో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. గుండె సంబంధిత సమస్యలను తగ్గించడంలో కూడా ఆపిల్ ఉపయోగపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటు నియంత్రణలో కూడా ఇది కీలకంగా పనిచేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఆపిల్ మంచి ఎంపిక. తక్కువ క్యాలరీలు ఉండటంతో పాటు ఎక్కువసేపు ఆకలి తగ్గిస్తుంది. దీనివల్ల అధిక ఆహారం తీసుకునే అలవాటు తగ్గుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచడంలో కూడా ఆపిల్ సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచి ముడతలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. అందువల్ల రోజువారీ ఆహారంలో ఆపిల్‌ను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. చిన్న అలవాటు పెద్ద మార్పును తీసుకురాగలదని నిపుణులు సూచిస్తున్నారు.

## మొక్కజొన్నతో ఆరోగ్యం మెరుగుదల

- పోషకాలు పుష్కలంగా ఉన్న సహజ ఆహారం
- జీర్ణశక్తికి మేలు చేసే ధాన్యం
- రోజువారీ ఆహారంలో చేర్చితే అనేక లాభాలు



మొక్కజొన్న మన దేశంలో విస్తృతంగా వినియోగించే ధాన్యాల్లో ఒకటి. తినడానికి రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు అందిస్తుంది. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఈ ఆహారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా ప్రాధాన్యం పొందుతోంది. మొక్కజొన్నలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నిపుణుల ప్రకారం మొక్కజొన్నను ఆహారంలో చేర్చడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న హానికర పదార్థాలను తగ్గించడంలో సహాయపడతాయి. కంటి ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. బరువు నియంత్రణలో కూడా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. ఇది తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి రాకుండా సహాయపడుతుంది. దీంతో అదనపు ఆహారం తీసుకోవడం తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. మొక్కజొన్నను ఉడికించి, వేయించి లేదా పులుసు రూపంలో తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా నూనె, ఉప్పు కలిపి తీసుకోవడం తగ్గించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చు. ఆహారంలో చిన్న మార్పులతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మొక్కజొన్నను నియమితంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని సూచిస్తున్నారు.



## పిల్లల్లో ముక్కులో, నోట్లో వేళ్లు పెట్టే అలవాటు

- ఇన్ఫెక్షన్లకు దారి
- అలవాటుతో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆరోగ్యంపై ప్రభావం ఎలా ఉంటుంది
- తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పిల్లల్లో సాధారణంగా కనిపించే అలవాట్లలో ముక్కులో లేదా నోట్లో వేళ్లు పెట్టుకోవడం ఒకటి. ఇది చిన్న విషయం అనిపించినా, ఆరోగ్యపరంగా ఇది అనేక ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న వయసులోనే ఈ అలవాటును నియంత్రించకపోతే, పిల్లలు తరచుగా జబ్బులకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. పిల్లలు బయట ఆడుకోవడం, పాఠశాలలో ఇతర పిల్లలతో కలవడం వల్ల చేతులపై బ్యాక్టీరియా, వైరస్‌లు సులభంగా చేరుతాయి. చేతులు శుభ్రంగా లేకుండానే ముక్కులో లేదా నోట్లో వేళ్లు పెట్టుకుంటే, ఈ సూక్ష్మజీవులు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. ముఖ్యంగా గోళ్ల కింద ఉండే మలినాలు ఇన్ఫెక్షన్‌కు ప్రధాన కారణంగా మారుతాయి. ఈ అలవాటు వల్ల ముక్కులో చిన్న గాయాలు, పుండ్లు ఏర్పడే అవకాశం ఉంది. అలాగే జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు త్వరగా సోకుతాయి. నోటిలో వేళ్లు పెట్టడం వల్ల దంత సమస్యలు, గమ్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు చేతులపై ఉన్న జర్మ్‌ను మింగడం వల్ల కడుపు సమస్యలు కూడా తలెత్తుతాయి. వైద్యులు చెబుతున్న ప్రకారం, ఈ అలవాటు ఎక్కువగా చిన్న పిల్లల్లో కనిపిస్తుంది. ఇది ఒక రకమైన అలవాటు ప్రవర్తనగా మారిపోతుంది. పిల్లలు ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా విసుగుగా ఉన్నప్పుడు ఈ అలవాటును మరింతగా చేస్తారు. కాబట్టి ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాకుండా, ప్రవర్తనా అంశంగా కూడా పరిగణించాలి. తల్లిదండ్రులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పిల్లలకు చేతులు శుభ్రంగా ఉంచుకోవడం గురించి అలవాటు చేయాలి. గోళ్లను చిన్నగా కట్ చేయడం, బయట నుంచి వచ్చిన వెంటనే చేతులు కడుక్కోవడం వంటి మంచి అలవాట్లు నేర్పాలి. అలాగే పిల్లలు వేళ్లు పెట్టకుండా ఉండేలా సున్నితంగా చెప్పాలి. పిల్లల్లో ఈ అలవాటు తగ్గించడానికి ప్రేమగా అవగాహన కల్పించడం అత్యంత అవసరం. శుభ్రతపై దృష్టి పెట్టడం ద్వారా పిల్లలను ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించవచ్చు. చిన్నప్పుడే మంచి అలవాట్లు నేర్పితే, వారి ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

## ఉల్లికాడల ఆరోగ్య మంత్రం



మన వంటింట్లో సాధారణంగా కనిపించే ఉల్లికాడలు ఆరోగ్యానికి అపారమైన ప్రయోజనాలు అందిస్తాయి. వీటిని చాలామంది కేవలం రుచికోసం మాత్రమే వాడుతుంటారు. అయితే ఇందులో ఉన్న పోషకాలు శరీరానికి అవసరమైన అనేక శక్తులను అందిస్తాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఇచ్చే సహజ ఆహారంగా ఉల్లికాడలు గుర్తింపు పొందుతున్నాయి. ఉల్లికాడల్లో విటమిన్ ఏ, సి, కె వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా మారుతున్న వాతావరణంలో జలుబు, దగ్గు వంటి సమస్యలను దూరంగా ఉంచడంలో ఇవి సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా ఉల్లికాడలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. హృదయ ఆరోగ్యానికి కూడా ఉల్లికాడలు మంచి మిత్రంగా నిలుస్తాయి. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేయడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఉల్లికాడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి కడుపు సమస్యలను తగ్గించి జీర్ణవ్యవస్థను సక్రమంగా పనిచేయించేలా చేస్తాయి. ఆకలి పెరగడంలో కూడా ఇవి సహాయపడతాయి. క్రమం తప్పకుండా తీసుకుంటే గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ఉల్లికాడల్లో ఉండే ఫైబర్ శరీర బరువును నియంత్రించడంలో ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు వీటిని తమ ఆహారంలో చేర్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ కాలరీలతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంగా ఇవి గుర్తింపు పొందాయి. అలాగే చర్మం కాంతివంతంగా ఉండటానికి కూడా ఉల్లికాడలు సహాయపడతాయి. వీటిలోని పోషకాలు శరీరంలో ఉన్న విషపదార్థాలను తొలగించి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. అందువల్ల రోజువారీ వంటల్లో ఉల్లికాడలను చేర్చడం ద్వారా ఆరోగ్యంతో పాటు అందాన్ని కూడా కాపాడుకోవచ్చు.

# బిజినెస్

## డాలర్ల కోసం ఆర్బీఐ కొత్త వ్యూహాలు..

- ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి



**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** కరెన్సీ మార్కెట్‌లో డాలర్ బలపడుతున్న నేపథ్యంలో రూపాయి విలువ మరింత ఒత్తిడికి లోనవుతోంది. ఈ పరిస్థితుల్లో దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలను పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితులు, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, అలాగే ముడి చమురు ధరల పెరుగుదల రూపాయిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాలతో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఫలితంగా దేశీయ ఫారెక్స్ రిజర్వులపై ఒత్తిడి ఏర్పడుతోంది. ఇటీవల రూపాయి డాలర్‌తో పోలిస్తే ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరుకోవడం గమనార్హం. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. గత కొన్ని నెలల్లో విదేశీ మదుపర్లు బిలియన్ల డాలర్ల పెట్టుబడులను భారత మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆర్బీఐ డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు పలు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తోంది. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి డాలర్ డిపాజిట్లు స్వీకరించడం, అలాగే విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేలా పన్ను విధానాల్లో మార్పులు చేయడం వంటి అంశాలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో ఫారెక్స్ రిజర్వులు గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత కొద్ది నెలల్లోనే గణనీయంగా తగ్గాయి. దీనికి అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఆర్బీఐ వద్ద ఉన్న విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) తగ్గడం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఇవే దిగుమతులు, చమురు చెల్లింపులకు ప్రధాన ఆధారం కావడంతో వీటి తగ్గుదల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. మొత్తానికి రూపాయి స్థిరత్వాన్ని కాపాడుతూ డాలర్ల ప్రవాహాన్ని పెంచడం ఆర్బీఐకి పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో తీసుకోబోయే కొత్త నిర్ణయాలు భారత ఆర్థిక వ్యవస్థపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

## బంగారం ధరలు దిగివచ్చాయి..



**హైదరాబాద్, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** బంగారం కొనుగోలు చేయా లని చూస్తున్న వారికి ఇది ఊరట కలిగించే వార్త. గత కొన్ని రోజులుగా భారీగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తాజాగా తగ్గుముఖం పట్టాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర మళ్లీ ఒక లక్షా యాభై వేల రూపాయల మార్క్ దిగువకు చేరింది. తాజా మార్కెట్ సమాచారం ప్రకారం, హైదరాబాద్ మరియు విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు ఒక లక్షా నలభై తొమ్మిది వేల ఆరు వందల రూపాయల వద్ద ఉంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర సుమారు ఒక లక్షా ముప్పై ఏడు వేల రూపాయల పరిధిలో కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇదే తరహా తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఆర్థిక మార్పులు కారణంగా బంగారం ధరల్లో ఒడిదుడుకులు కొనసాగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల వరుసగా పెరిగిన ధరలు ఇప్పుడు కాస్త తగ్గడంతో వినియోగదారులకు కొంత ఊరట లభిస్తోంది ధరల్లో కూడా స్వల్ప తగ్గుదల కనిపించింది. కిలో వెండి ధరలో సుమారు వంద రూపాయల వరకు తగ్గుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై వంటి నగరాల్లో కిలో వెండి ధర సుమారు రెండు లక్షల అరవై తొమ్మిది వేల రూపాయల వద్ద కొనసాగుతోంది. ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు ఉన్నాయి. మొత్తానికి, బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గడంతో కొనుగోలుదారులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులపై ఆధారపడి ధరలు మళ్లీ మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రుణమాఫీ పేరుతో మోసాలకు దూరంగా ఉండండి




**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** రుణాలు మాఫీ చేయిస్తామని చెబుతూ జరుగుతున్న తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత హామీలను నమ్మి ఎవరికీ డబ్బులు చెల్లించవద్దని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలు, వ్యక్తిగత సందేశాల ద్వారా కొందరు కేటుగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని రుణమాఫీ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఆర్బీఐ పేర్కొంది. ఈ తరహా తప్పుడు ప్రచారాలు ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికే కాకుండా సాధారణ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపింది. బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల వద్ద ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేయిస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థలు పూర్తిగా నమ్మదగినవారు కాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఇలాంటి హామీలు ఇచ్చే వారిని నమ్మి ఆర్థిక లావాదేవీలు చేయరాదని ప్రజలకు సూచించింది. ఇలాంటి మోసాలు కొనసాగితే దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. డిపాజిటర్ల ప్రయోజనాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్బీఐ హెచ్చరించింది. మొత్తానికి రుణమాఫీ పేరుతో వచ్చే ప్రకటనలు, ఆఫర్ల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.

## దీర్ఘకాలిక మూలధనమే ఆర్థిక వ్యవస్థకు ఇంధనం



**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలంటే దీర్ఘకాలిక మూలధనం అత్యంత అవసరమని మూలధన మార్కెట్ నియంత్రణ మండలి అధిపతి తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. ఈ నిధులు పూర్తిగా మార్కెట్ ఆధారితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అలా ఉంటేనే అవి దేశ ఆర్థిక వృద్ధికి ఇంధనంలా పనిచేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఐఎంసీ మూలధన మార్కెట్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో రుణ పత్రాల మార్కెట్ మరియు ఈక్విటీ మార్కెట్ రెండూ కలిసి పనిచేస్తే మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా నిధులు సమకూర్చవచ్చని తెలిపారు. దీర్ఘకాలిక ప్రాజెక్టులకు స్థిరమైన పెట్టుబడులు అవసరమని ఆయన చెప్పారు. పెట్టుబడుల ఎంపిక విషయంలో మదుపరులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. మార్కెట్ అభివృద్ధి, మదుపరుల రక్షణ రెండింటినీ సమతుల్యంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. నష్టభయాన్ని నియంత్రిస్తూ అన్ని ఆర్థిక విభాగాలను బలోపేతం చేయడం తమ లక్ష్యమని తెలిపారు. బ్యాంకులు, బీమా సంస్థలు కమోడిటీ డెరివేటివ్స్‌లో పెట్టుబడులు పెట్టే అంశంపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. ఈ విషయంలో భారతీయ రిజర్వు బ్యాంకు, బీమా నియంత్రణ మండలి పెద్దగా సానుకూలంగా లేవని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి కొన్ని కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. పెన్షన్ నిధులు కమోడిటీ డెరివేటివ్స్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని పెన్షన్ నియంత్రణ మండలి పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ అంశంపై తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉందని చెప్పారు. అలాగే కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతలు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశంపై కూడా ఆయన స్పందించారు. ఈ సాంకేతికతల వల్ల వచ్చే ప్రమాదాలపై త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఫ్లిప్‌కార్ట్ సేల్‌కి రెడీ




**హైదరాబాద్, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** కొత్త స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ కొనాలని చూస్తున్న వినియోగదారులకు ఫ్లిప్‌కార్ట్ భారీ ఆఫర్లను ప్రకటించింది. 'సాసా లేలే సేల్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక సేల్ మే 9 నుంచి ప్రారంభం కానుంది. ప్లస్ సభ్యులకు అయితే మే 8 నుంచే ఆఫర్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ సేల్‌లో 2025, 2026 మోడల్ ల్యాప్‌టాప్‌లు భారీ డిస్కౌంట్లతో అందుబాటులో ఉండనున్నాయి. ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై ఆకర్షణీయమైన ధర తగ్గింపులు ప్రకటించారు. శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 ల్యాప్‌టాప్ ధర భారీగా తగ్గి వినియోగదారులను ఆకర్షిస్తోంది. అలాగే అసుస్ వివోబుక్ 14 కూడా తక్కువ ధరలో లభించనుంది. మోటోబుక్ 60 ఓఎల్ఈడి వంటి ప్రీమియం మోడళ్లపై కూడా పెద్ద తగ్గింపులు అందుబాటులో ఉంటాయని సమాచారం. ల్యాప్‌టాప్‌లతో పాటు ఐఫోన్ ప్రియులకు కూడా ఈ సేల్ ప్రత్యేకంగా నిలవనుంది. ఐఫోన్ 17 సిరీస్‌తో పాటు ఐఫోన్ 16, ఐఫోన్ 15 మోడళ్లపై కూడా గణనీయమైన ధర తగ్గింపులు లభించనున్నాయి. టాప్ వేరియంట్లపై కూడా వేల రూపాయల వరకు డిస్కౌంట్ ఉండే అవకాశం ఉంది. అదనంగా ఎస్బీఐ క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభించనుంది. పాత ఫోన్లు లేదా ల్యాప్‌టాప్‌లను ఎక్స్ఛేంజ్ చేసి అదనపు విలువ పొందే అవకాశం కూడా ఉంది. యూపీఐ చెల్లింపుల ద్వారా మరిన్ని ఆఫర్లు పొందవచ్చని కంపెనీ తెలిపింది. అమెజాన్ కూడా మే 8 నుంచి సమ్మర్ సేల్ ప్రారంభించనున్న నేపథ్యంలో, కొనుగోలుదారులు రెండు ప్లాట్‌ఫార్మ్‌లలో ధరలను పోల్చి చూసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. స్టాక్ పరిమితంగా ఉండే అవకాశం ఉన్నందున ముందుగానే ఎంపిక చేసుకోవాలని సూచనలు వెలువడుతున్నాయి.

## కొత్త బంధాలపై తమన్నా వ్యాఖ్యలు



ప్రేమ, వ్యక్తిగత బంధాలపై నటి తమన్నా భాటియా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, ప్రేమ అనేది జీవితంలో ఒక్కసారి మాత్రమే జరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మనసుకు నిజంగా నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదని తమన్నా అన్నారు. ప్రతి సంబంధం మన జీవితానికి ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుందని, ఆ అనుభవాలు వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేమలో ఉన్నప్పుడు అది ఇద్దరికీ ఆనందాన్ని, ఎదుగుదలను ఇవ్వాలి గానీ, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేలా మారకూడదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రేమను ఒక లావాదేవీలా చూడకూడదని తమన్నా పేర్కొన్నారు. ఎదుటివారి నుంచి ఏదైనా ఆశించడం మొదలైతే అది నిజమైన ప్రేమ కాకుండా వ్యాపార సంబంధంలా మారిపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు. నిజమైన ప్రేమ అనేది స్వేచ్ఛ, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడం వంటి విలువలపై నిలబడాలని ఆమె తెలిపారు. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్ల నేపథ్యంలో చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా సంబంధాలపై ఆమె వ్యక్తపరిచిన స్పష్టమైన అభిప్రాయాలు యువతలో చర్చకు దారితీస్తున్నాయి.

## హీరోయిన్‌గా పీక్‌లో ఉన్నా సడెన్ బ్రేక్



హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్న సమయంలోనే టాలీవుడ్ బ్యూటీ కామాక్షి భాస్కర్ల తీసుకున్న సడెన్ నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్న ఆమె, ఉన్నట్లుండి సినిమాలకు తాత్కాలిక విరామం ప్రకటించడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. 'మా ఊరి పొలిమేర' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన కామాక్షి, ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించి తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. సహాయక పాత్రల నుంచి హీరోయిన్ పాత్రల వరకు విభిన్న పాత్రల్లో కనిపించిన ఆమె, ఇటీవల వచ్చిన ప్రాజెక్టులతో మంచి జోరులో ఉంది. ప్రస్తుతం కూడా ఆమె చేతిలో పలు క్రేజీ సినిమాలు, వెబ్ ప్రాజెక్టులు ఉన్నాయని సమాచారం. ఇలాంటి సమయంలో ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ పోస్ట్ చేస్తూ సినిమాలకు బ్రేక్ తీసుకుంటున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం వెనుక కారణం తన మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత శాంతి కోసం కొంత సమయం కావాలనే ఉద్దేశమని ఆమె స్పష్టం చేసింది. "నటనపై విసుగు వల్ల కాదు, నా జీవితాన్ని మరింత ప్రశాంతంగా అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ విరామం తీసుకుంటున్నాను. కొన్నిసార్లు ముందుకు సాగాలంటే కొంత వెనక్కి తగ్గాలి. ఇది నా రీచార్జ్ సమయం మాత్రమే" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొంది. అయితే ఇది పూర్తిగా కెరీర్‌కు గుడ్‌బై కాదని, తాత్కాలిక విరామం మాత్రమేనని ఆమె స్పష్టం చేయడం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. త్వరలోనే మళ్లీ కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు వస్తానని ఆమె తెలిపింది. కామాక్షి తీసుకున్న ఈ నిర్ణయం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానులు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు.

## ఫౌజీ చిత్రబృందానికి ప్రమాదం






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రబృందానికి విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటన సినీ వర్గాలను కలచివేసింది. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ వేగంగా కొనసాగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో చిత్రబృందం ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రొడక్షన్ విభాగానికి చెందిన ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో చిత్రబృందం, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. షూటింగ్ పనుల నిమిత్తం బయలుదేరిన సమయంలోనే ఈ ప్రమాదం జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ వ్యయంతో నిర్మిస్తోంది. సినిమాలో ప్రభాస్ సరసన ఇమాన్వీ కథానాయికగా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవీంద్రన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి సంతాపం తెలియజేసిన చిత్రబృందం, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## కల్కి-2'లో సాయి పల్లవి..?




కల్కి 2898 ఏడి చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రభాస్ ఇప్పుడు ఆ సినిమాకు రాబోయే రెండో భాగంపై అందరి దృష్టి నిలిచింది. దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న ఈ భారీ సీక్వెల్‌కు సంబంధించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సీక్వెల్‌లో సహజ నటిగా పేరు తెచ్చుకున్న సాయి పల్లవి కీలక పాత్రలో కనిపించనున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మొదటి భాగంలో పలువురు స్టార్ నటీనటులు మెరిసిన నేపథ్యంలో, రెండో భాగంలో మరింత బలమైన పాత్రలను జోడించేందుకు దర్శకుడు ప్రయత్నిస్తున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో సాయి పల్లవి ఎంట్రీ ఉంటే, కథలో భావోద్వేగ గాఢత మరింత పెరుగుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఈ వార్త నిజమైతే, ప్రభాస్-సాయి పల్లవి కలయికను తెరపై చూడటం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ఇదిలా ఉండగా, సాయి పల్లవి ఇటీవల అస్వస్థతకు గురైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ఆమె పాల్గొనాల్సిన చిత్రీకరణకు తాత్కాలికంగా విరామం ఇచ్చినట్లు తెలుస్తోంది. నటీనటుల ఆరోగ్యం ప్రాధాన్యంగా భావిస్తున్న దర్శకుడు నాగ్ అశ్విన్, ఆమె పూర్తిగా కోలుకున్న తర్వాతే షూటింగ్‌ను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

## వికెట్ తర్వాత జేబులోంచి చిట్టీ తీసిన రఘు శర్మ

**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 19వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ యువ స్పిన్నర్ రఘు శర్మ తన మొదటి వికెట్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ అక్షత్ రఘువంశీని అవుట్ చేసిన వెంటనే అతను చేసిన ప్రత్యేక సెలబ్రేషన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వికెట్ తీసిన ఆనందంలో రఘు శర్మ తన జేబులోంచి ఒక చిన్న చిట్టీ తీసి దాన్ని





చూసి ఆకాశం వైపు చూపిస్తూ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ ఘటన మైదానంలో భావోద్వేగ క్షణంగా నిలిచింది. ఆ చిట్టీలో అతను రాసుకున్న సందేశం ఇప్పుడు అభిమానులను మరింతగా ఆకట్టుకుంటోంది. అందులో "గురువుల ఆశీస్సులతో నా 15 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. ఈ అవకాశం ఇచ్చిన ముంబై ఇండియన్స్ జట్టుకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను" అనే భావోద్వేగ మాటలు ఉన్నాయి. దేశవాళీ క్రికెట్‌లో ఎన్నో సంవత్సరాలు అవకాశాల కోసం ఎదురు చూసిన రఘు శర్మకు ఈ వికెట్ పెద్ద మైలురాయిగా నిలిచింది. కష్టానికి ఫలితం ఐపీఎల్ వేదికపై దొరకడం అతని కెరీర్‌లో ప్రత్యేక ఘట్టంగా మారింది. ఈ మ్యాచ్‌లో ముంబై జట్టు భారీ లక్ష్యాన్ని సులభంగా ఛేధించి ఘన విజయం సాధించింది. రోహిత్ శర్మ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును విజయ తీరాలకు చేర్చాడు. ఈ విజయంతో పాటు రఘు శర్మ భావోద్వేగ సెలబ్రేషన్ కూడా మ్యాచ్ హైలైట్‌గా నిలిచింది.

## ముంబై కెప్టెన్సీ మార్పుపై ప్రచారాలకు చెక్..



**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్సీపై జరుగుతున్న మార్పుల పుకార్లకు సంబంధించి ఎటువంటి నిజం లేదని జట్టు వర్గాలు స్పష్టం చేశాయి. హార్దిక్ పాండ్యాను కెప్టెన్సీ నుంచి తొలగిస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అబద్ధమని తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా లక్నోతో జరిగిన మ్యాచ్‌లో ఆడకపోవడానికి కారణం ఆరోగ్య సమస్యలేనని సమాచారం. వెన్నునొప్పి కారణంగా అతను ఆ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అందుకే ఆ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ తాత్కాలికంగా జట్టును నడిపించాడు. జట్టు యాజమాన్యం మాత్రం హార్దిక్ నాయకత్వంపై పూర్తి నమ్మకంతో ఉందని స్పష్టం చేసింది. ప్రస్తుత సీజన్‌లో ముంబై జట్టు ఓటములకు కెప్టెన్సీ ఒక్కటే కారణం కాదని, ఆటగాళ్ల ఫామ్ లోపం మరియు జట్టు సమన్వయ సమస్యలే ప్రధాన కారణాలని విశ్లేషిస్తోంది. సీనియర్ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడం కూడా జట్టును ప్రభావితం చేస్తోందని భావిస్తున్నారు. అయినప్పటికీ మిగిలిన మ్యాచ్‌ల్లో బలంగా తిరిగి రావాలని ముంబై యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. రోహిత్ శర్మ తిరిగి జట్టులో చేరడం జట్టుకు పెద్ద బలంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. హార్దిక్ పూర్తిగా ఫిట్ అయిన తర్వాత మళ్లీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడతారని జట్టు వర్గాలు తెలిపాయి.

## పంత్ ఫామ్‌పై కోచ్ లాంగర్ స్పష్టత..





**ముంబై, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 19వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ ఫామ్‌పై విమర్శలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జట్టు ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పంత్‌పై వస్తున్న విమర్శలను లాంగర్ పూర్తిగా తోసిపుచ్చారు. పంత్ ఒక గొప్ప ఆటగాడని, అతని ఫామ్‌ను అతని భారీ ధరతో పోల్చడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. నాయకత్వ బాధ్యతలు ఎప్పుడూ ఒత్తిడితో కూడుకున్నవని, జట్టును ముందుకు నడిపించే క్రమంలో పంత్ చాలా బాధ్యతలు మోస్తున్నాడని తెలిపారు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో పంత్ తన బ్యాటింగ్ స్థానాన్ని కూడా మార్చుకుని జట్టు ప్రయోజనాలను ప్రాధాన్యంగా పెట్టుకున్న విషయాన్ని లాంగర్ గుర్తు చేశారు. ఇది అతని నిస్వార్థ ఆటతీరు అని ఆయన ప్రశంసించారు. పంత్ త్వరలోనే మంచి ఫామ్‌లోకి వస్తాడని కోచ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రాక్టీస్ సెషన్లలో పంత్ మంచి లయలో కనిపిస్తున్నాడని, అది త్వరలోనే మైదానంలో కూడా కనిపిస్తుందని చెప్పారు. ప్రస్తుతం లక్నో జట్టు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 2 విజయాలతో 4 పాయింట్లు మాత్రమే సాధించింది. ప్లేఆఫ్స్ ఆశలు నిలవాలంటే మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సిన పరిస్థితి ఉంది.

## ప్లేఆఫ్స్ రేసు వేడెక్కింది..

### - మూడు జట్లకు గెలుపే తప్పనిసరి




**హైదరాబాద్, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 19వ సీజన్ లీగ్ దశ చివరి దశకు చేరడంతో ప్లేఆఫ్స్ రేసు మరింత ఉత్కంఠగా మారింది. కొన్ని జట్లు సేఫ్ జోన్‌లో ఉన్నప్పటికీ, మూడు జట్లకు మాత్రం ప్రతి మ్యాచ్ గెలవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. లక్నో, ముంబై, కోల్‌కతా జట్లు ప్రస్తుతం అత్యంత ఒత్తిడిలో ఉన్నాయి. లక్నో జట్టు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా విజయం సాధించాలి. ఒక్క మ్యాచ్ ఓడినా ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపు ముగిసిపోతాయి. ముంబై జట్టు కూడా మిగిలిన మ్యాచ్‌ల్లో గెలవడమే కాకుండా ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్‌రేట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిలో ఉంది. కోల్‌కతా జట్టు కూడా ప్లేఆఫ్స్ ఆశలు కొనసాగించాలంటే మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సిందే. ఇక పాయింట్ల పట్టికలో పైభాగంలో ఉన్న పంజాబ్, బెంగళూరు జట్లు రెండు విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకునే అవకాశం ఉంది. హైదరాబాద్, రాజస్థాన్, గుజరాత్ జట్లు మిగిలిన మ్యాచ్‌ల్లో కనీసం రెండు విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ అవకాశాలు బలపడతాయి. చెన్నై, ఢిల్లీ జట్లు మాత్రం జాగ్రత్తగా ఆడాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో తగిన విజయాలు సాధించకపోతే ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవాల్సి రావచ్చు. ఈ కీలక దశలో జట్ల ప్రదర్శన ఎలా ఉండబోతోందన్నదే అభిమానుల్లో ప్రధాన ఆసక్తిగా మారింది.

## కేఎల్ రాహుల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, మే 5 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 433 పరుగులు సాధించి టోర్నీలో రెండో అత్యధిక స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. పంజాబ్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో 67 బంతుల్లో 152 పరుగులు చేసి అజేయంగా నిలవడం అతని సత్తాకు నిదర్శనంగా నిలిచింది. ఈ సీజన్‌లో రెండు అర్ధ శతకాలు, ఒక భారీ శతకంతో అతను జట్టుకు కీలక ఆటగాడిగా మారాడు. తాజాగా నిర్వహించిన 'సూపర్ స్టార్స్' కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ తన కెరీర్ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనను చాలా కాలం పాటు కేవలం టెస్టు ఆటగాడిగానే చూశారని, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు తగిన ఆటగాడిగా గుర్తించలేదని చెప్పాడు. అయితే క్రమంగా తన ఆటతీరును మార్చుకుని ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నానని వివరించాడు. టీ20 క్రికెట్‌లో గత మూడేళ్లలో వచ్చిన మార్పులను కూడా అతను ప్రస్తావించాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాల్సిన అవసరం పెరిగిందని, అందుకే తన బ్యాటింగ్ విధానంలో మార్పులు చేసుకున్నానని తెలిపాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడటమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశాడు. తాను గెలిచినా ఓడినా సమతుల్యంగా ఉండటానికి ప్రయత్నిస్తానని, సాధించని వాటిపై బాధపడకుండా ఇప్పటికే సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటానని రాహుల్ చెప్పాడు. మరికొంత కాలం క్రికెట్ ఆడి మరిన్ని విజయాలు సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు.